సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



రోగుల బిల్లులు స్వాహా
విద్యాశాఖలో ఓ అవినీతి అధికారి అక్రమాలు తారాస్థాయికి చేరుకున్నాయి. గతంలో ఉపాధ్యాయులు డీఈవోకు ఫిర్యాదు చేసినా అతడి తీరు మారడంలేదు. IIలో▸



అభివృద్ధికి ఆమడదూరం
జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఏళ్లకేళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నాయి. IIIలో▸

గరిష్టం/కనిష్టం
33.0/21.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేడు బాలల సైన్స్ కాంగ్రెస్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసేందుకు దీనిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ అంశాలు, ఉపఅంశాలపై మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 6నుంచి పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గైడ్ టీచర్‌తో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రఘురమణను 9440060288 నంబర్‌లో, డీసీఈబీ ఆరె భాస్కర్‌ను 9704851411 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'బహిరంగసభ సక్సెస్ చేయాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో శుక్రవారం మండలకేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని గిరిజనేతరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావ్ కోరారు. గురువారం ఇంద్రవెల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సభకు ముఖ్య అతిథిగా అంబేద్కర్ మనుమడు అడ్వకేట్ ప్రకాశ్ అంబేద్కర్ రానున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజనేతర సంఘం నాయకులు, విద్యార్థులు, మేధావులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. నేతకాని మహర్ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ దీపక్‌కుమార్, గిరిజనేతర సంఘం నాయకులు సంజీవ్ లహనే, ఎండీ మసూద్, గ్రామపటేల్ డోంగ్రె మారుతి, నాయకులు సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మారే కాంరాజ్, పరత్వాగ్ దత్త, బాలరాజ్, ఉత్తం, లహుదాస్, సత్యానంద్ తదితరులున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అశోక్ గోయల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని పోలీస్ అబ్జర్వర్, మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌కు చెందిన ఐజీ అశోక్ గోయల్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రానికి రాగా, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శాంతిభద్రతలు, చెక్‌పోస్టులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తదితర విషయాలపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు, తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాల మోహరింపు, పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

'ఉన్నతవిద్య అభ్యసించాలి'

ఆదిలాబాద్‌రూరల్: బాలికలు ఉన్నతవిద్య అభ్యసించాలని మహిళా సాధికారత కేంద్రం మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ యశోద సూచించారు. గురువారం మావల మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత ఆవశ్యకత, లింగ వివక్ష, లింగ సమానత్వం, పోక్సో చట్టం, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, సైబర్ క్రైం, లింగనిర్ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కోటేశ్వర, కృష్ణవేణి, నిఖిలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలగిరికి స్పెషల్ బస్సు

ఆదిలాబాద్: కార్తీక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలానికి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డీఎం కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, గుడిహత్నూర్, ఇచ్చోడ నుంచి వెళ్లే భక్తులకు రూ.5వేలు చార్జి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన ఉదయం 11గంటలకు పుణ్యక్షేత్రానికి సూపర్ లగ్జరీ సర్వీస్ బయలుదేరుతుందని, ఈనెల 26న మధ్యాహ్నం 2గంటల వరకు అరుణాచల గిరికి చేరుకుంటుందని తెలిపారు. దర్శనానికి 24 గంటల సమయం ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి అరుణాచలం నుంచి 27న 3గంటలకు సర్వీస్ ప్రారంభమవుతుందని, 28వ తేదీన సాయంత్రం ఐదు గంటల వరకు ఆదిలాబాద్‌కు చేరుకుంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ వంశీనాథ్‌ను 7392800975, రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జి సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌ను 7382840334 నంబర్లలో సంప్రదించాలన్నారు.



బోథ్: స్వతంత్ర అభ్యర్థిగా వన్నెల అశోక్ తరపున నామినేషన్ వేస్తున్న అతడి అనుచరులు

స్వతంత్రుల జోరు

- పార్టీలకు దీటుగా నామినేషన్లు
- నేటితో నామినేషన్ గడువు పూర్తి
- వ్యూహాత్మకంగా పార్టీల అభ్యర్థులు
- వివిధ సమీకరణలతో స్వతంత్రులను బరిలోకి దించుతున్న వైనం
- నేడు మరికొందరు స్వతంత్రులూ..

గురువారం దాఖలైన నామినేషన్లు

నియోజకవర్గం	నామినేషన్ల సంఖ్య
ఆదిలాబాద్	26
బోథ్	11
ఖానాపూర్	15
ఆసిఫాబాద్	15

సాక్షి, ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికల సంగ్రామంలో చిత్రవిచిత్రమైన తంతు చోటు చేసుకుంటోంది. పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. ప్రజా ప్రాబల్యంలో అంతగా పరిచయం లేనివారు కూడా రంగంలోకి దిగుతున్నారు. దీంతో వారు ఈ రణరంగంలో సీరియస్‌గా పోటీ చేసేందుకు వచ్చారా.. లేనిపక్షంలో వెనుకెవరైనా ఉన్నారా.. అని పలువురు అనుమానిస్తున్నారు. కాగా, కొందరు స్వతంత్రుల నామినేషన్ వెనుక ప్రధాన పార్టీల అభ్యర్థులున్నట్లు తెలుస్తోంది. ఇందులో రాజకీయ సమీకరణలు కూడా దాగి ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. శుక్రవారం నామినేషన్ల ఘట్టం ముగియనుండగా ఎంతమంది స్వతంత్రులు నామినేషన్లు వేస్తారో.. అనే ఆసక్తి జిల్లావాసుల్లో ఉంది.

ఒకటి.. అంతకంటే ఎక్కువ సెట్లు..

నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఒకట్రెండు, అంతకంటే ఎక్కువ కూడా వేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఆదిలాబాద్ అభ్యర్థి జోగు రామన్న, బోథ్ అభ్యర్థి అనిల్‌జాదవ్, ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్, ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి, బీజేపీ నుంచి ఆదిలాబాద్ అభ్యర్థి పాయల్ శంకర్, బోథ్ అభ్యర్థి సోయం బాపూరావు, ఖానాపూర్ అభ్యర్థి రాథోడ్ రమేశ్, ఆసిఫాబాద్ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్, కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి, బోథ్ అభ్యర్థి ఆడె గజేందర్, ఖానాపూర్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ అభ్యర్థి శ్యామ్‌నాయక్ ఒకటి, అంతకంటే ఎక్కువ సెట్లు వేశారు. కాగా, బహుజన్ సమాజ్ పార్టీ, ధర్మ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ జనక్రాంతి, బహుజన్ ముక్తి పార్టీ, ప్రజా ఏక్తా పార్టీ, ప్రజా ముక్తి పార్టీ, సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాల నుంచి కూడా అభ్యర్థులు వివిధ నియోజకవర్గాల నుంచి నామినేషన్లు వేశారు.

నామినేషన్ల పర్వం.. చిత్రవిచిత్రం

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి సాయిమౌనారెడ్డి నామినేషన్ వేశారు. కంది ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన భార్యతో ముందుజాగ్రత్తగా ఇలా వేయించారా.. అని పార్టీలో చర్చించుకుంటున్నారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా సీఆర్‌ఆర్ మేనల్లుడు సంజీవ్‌రెడ్డిని కాంగ్రెస్ అసమ్మతి వర్గం బరిలో నిలుపుతోంది. ఆయన శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ప్రజా ఏక్తా పార్టీ నుంచి కేమ శ్రీనివాస్ నామినేషన్ వేశారు. ఈ పార్టీ ఎన్నికల గుర్తు ప్రెషర్ కుక్కర్. దీనిపై ఆదిలాబాద్‌లో ఓ ప్రచారం సాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కుక్కర్లు పంపిణీ చేశారు. అప్పట్లో తన అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో శ్రీనివాసరెడ్డి హస్తం గుర్తు లేకుండా పంపిణీ చేశారు. దీంతో ప్రజల్లో అతడి గుర్తు కుక్కరా.. అనే కన్ఫ్యూజన్ కొనసాగుతోంది. అలాగే ఆయన పేరును పోలి ఉన్న కేమ శ్రీనివాస్‌ను బరిలోకి దించడం ద్వారా ప్రధాన పార్టీ అభ్యర్థికి పడే ఓట్లు చీల్చాలనే ఎత్తుగడలా కనిపిస్తోంది. బోథ్ కాంగ్రెస్‌లో 'బీ' ఫామ్ నిరాకరణకు గురై అభ్యర్థిత్వం కోల్పోయిన వన్నెల అశోక్ గురువారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కుల సమీకరణలతో ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. తమ ప్రధాన ప్రత్యర్థులను ఓడించేందుకు ప్రణాళిక చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆ కులానికి సంబంధించిన అభ్యర్థులను ఇండిపెండెంట్‌గా బరిలోకి దించి తద్వారా ఓట్లు చీల్చాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా చివరిరోజు ఇంకా ఎవరు రంగంలోకి దిగుతారనేది కూడా చూడాల్సిందే. ఇవన్నీ ఆయా నియోజకవర్గాల్లో ఆసక్తి కలిగిస్తున్న పరిణామాలే.

పోటాపోటీగా నామినేషన్లు



బోథ్: నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు



ఉట్నూర్‌రూరల్: నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్



బోథ్: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గజేందర్



ఉట్నూర్‌రూరల్: నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి కళ్యాణి రాథోడ్



కైలాస్‌నగర్: నామినేషన్ కేంద్రానికి ర్యాలీగా వస్తున్న డీఎస్పీ అభ్యర్థి గణేశ్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం ఆదిలాబాద్ నియోజకవర్గానికి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి అగ్గిమల్ల గణేశ్, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి, బలిరాజ పార్టీ తరపున ఎల్చల్‌వార్ సత్యనారాయణ, స్వతంత్రులు అన్నం దేవేందర్, ముండే ప్రవీణ్‌కుమార్ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. భారతచైతన్య యువజన పార్టీ తరపున గుడిపెల్లి జ్ఞానేశ్, స్వతంత్రులుగా తక్‌బిడే పండిత్‌రావు, కలమడుగు విజయ్‌కుమార్, గేడం జనార్దన్ నామినేషన్ దాఖలు చేయగా, కంది శ్రీనివాసరెడ్డి సతీమణి గడ్డం సాయిమౌనారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి స్రవంతికి నామినేషన్ పత్రం అందజేశారు.

బోథ్ నియోజకవర్గానికి..

బోథ్: బోథ్ నియోజకవర్గంలో గురువారం ఒక్కరోజే 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎనిమిది మంది అభ్యర్థులు 11 సెట్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ నామినేషన్ వేయగా, ఆయన తరపున అతడి అనుచరులు మరో రెండు సెట్లు వేశారు. బోథ్ అభ్యర్థి సోయం బాపూరావ్ తరపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, ఆయన అనుచరులు మరో సెట్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థిగా సోయం మొత్తంగా మూడు సెట్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ నామినేషన్ దాఖలు చేశారు. 6వ తేదీన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ మరో సెట్ వేశారు. ఆయన తరపున పలువురు ప్రజాప్రతినిధులు మరో సెట్ దాఖలు చేశారు. ఇప్పటికే ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి ఉయికె ఉమేశ్ నామినేషన్ వేయగా, ఆయన తరపున అతడి అనుచరులు మరో సెట్ వేశారు. రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అభ్యర్థిగా ఉహికె హీరాజీ, స్వతంత్ర అభ్యర్థిగా జాదవ్ భోజ్యానాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ధనలక్ష్మి, గురువారం మరో సెట్ వేశారు. మొదట వన్నెల అశోక్‌కు టికెట్ ప్రకటించిన కాంగ్రెస్ ఆ తర్వాత రద్దు చేయడంతో అతడి అనుచరులు ఆయన తరపున స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

ఖానాపూర్ నియోజకవర్గానికి..

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, రవీందర్ రావు, పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను ఆర్వో జీవాకర్‌రెడ్డికి అందించారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ మూడో సెట్, కాంగ్రెస్ అభ్యర్థి బొజ్జు తరఫున ఆయన అనుచరులు రెండో సెట్ నామినేషన్ పత్రాలు అందించారు. బీఎస్పీ నుంచి కళ్యాణి రాథోడ్, స్వతంత్ర అభ్యర్థులుగా మోహన్ జాదవ్, రవికిరణ్ నామినేషన్లు వేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. న్యాయసేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్టార్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కులు, ఇతర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, చీఫ్ ఎల్‌ఏడీసీ గంగారాం, పీపీ రమణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి అండర్ 14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు సొంత రాకెట్‌తో ఉదయం 10గంటలకు పోటీల కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకుడు వినోద్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

'పది'లో పరేషాన్..!

- వేధిస్తున్న 'సబ్జెక్ట్' టీచర్ల కొరత
- కోర్టు కేసుతో నిలిచిన ప్రమోషన్లు
- ప్రారంభించని ప్రత్యేక తరగతులు
- చదువులో వెనుకబడిన విద్యార్థులు
- ఎస్సెస్సీ ఫలితాలపై తీవ్రప్రభావం



ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏటా నవంబర్‌లో ప్రత్యేక తరగతులు ప్రారంభించగా ఈసారి ఆ ఊసెత్తడం లేదు. దీనికితోడు ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల కారణంగా కొందరు ఉపాధ్యాయులు తరగతులకు సరిగా హాజరు కాలేదు. ఎలాగూ బదిలీ అవుతున్నామని పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్నికల విధులు, శిక్షణ తదితర కార్యక్రమాల ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోంది. ఈసారి పదో తరగతి ఫలితాలు మరింతగా పడిపోయే అవకాశమున్నట్లు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

భర్తీ చేయని ఖాళీలు

సర్కారు బడుల్లో ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. ఈ కారణంగా విద్యార్థులు సిలబస్‌లో వెనుకబడి ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో ఎస్జీటీలను సర్దుబాటు చేసినా నాణ్యమైన బోధన చేపట్టడం లేదు. జిల్లాలో 1,268 స్కూల్ అసిస్టెంట్ పోస్టులుండగా, 972 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 296 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మధ్యలో నిలిచిన ప్రక్రియ

ఇటీవల ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించాయి. జిల్లాలో 42మంది స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు పొందారు. దీంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటి భర్తీకి ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాల్సి ఉండగా, ప్రక్రియ మధ్యలోనే నిలిచింది. కోర్టు కేసు కారణంగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించలేదు. 379 మంది స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు జరగగా, 142 మందిని రిలీవ్ చేశారు. ఇంకా 237 మంది బదిలీ అయిన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంది. సబ్‌స్టిట్యూట్ లేక వీరిని రిలీవ్ చేయలేదు. కాగా, బదిలీ అయినప్పటికీ తమను రిలీవ్ చేయలేదని కొంతమంది ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రస్తుతం వీరిని రిలీవ్ చేయలేదు. ఎన్నికల ప్రక్రియ అనంతరం వీరు బదిలీ అయిన స్థానాల్లో చేరనున్నారు. అప్పటి దాకా విద్యార్థుల చదువులపై మరింత ప్రభావం పడనుంది. మారుమూల గ్రామాల పాఠశాలల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు.

ప్రత్యేక తరగతుల ఊసేది?

పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఏటా నవంబర్ మొదటి వారంలోనే స్పెషల్ క్లాసులు నిర్వహించేవారు. ఈసారి ప్రత్యేక తరగతుల ఊసెత్తడంలేదు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఉపాధ్యాయులు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అందరి దృష్టి ప్రస్తుతం ఎన్నికలపైనే ఉంది. ఇటీవల ఉపాధ్యాయులకు ఎన్నికల విధులకు సంబంధించి మూడురోజులు శిక్షణ ఇచ్చారు. దీపావళి సెలవులూ రానున్నాయి. అలాగే ఎన్నికల పోలింగ్ విధులు కూడా చేపట్టాల్సి ఉంది. ఇటీవల పదోన్నతులు, బదిలీల కారణంగా ఉపాధ్యాయులు బిజీబిజీగా గడిపారు. ప్రస్తుతం ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీని ప్రభావం నేరుగా విద్యార్థుల చదువులపై పడనుంది. 2021–22 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు జిల్లాలో 95శాతం ఉత్తీర్ణత సాధించగా, జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాల్లో 86 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 19వ స్థానానికి పడిపోయింది. ఈసారి ఫలితాలు మరింతగా పడిపోయేలా ఉన్నాయి.

డిసెంబర్ నుంచి స్పెషల్ క్లాసులు



పదో తరగతి విద్యార్థుల చదువులపై ప్రభావం లేకుండా చర్యలు చేపడతాం. డిసెంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. ఖాళీల కొరత ఉన్నచోట అవసరానికి మించి అదనంగా ఉన్న ఉపాధ్యాయులను కొందరిని సర్దుబాటు చేస్తాం. మంచి ఫలితాలు సాధించేలా చూస్తాం. – ప్రణీత, డీఈవో

28నుంచి ధాన్యం కొనుగోళ్లు



కరపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: జిల్లాలో ఈ నెల 28నుంచి వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ కే శ్యామలాదేవి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లు, కేంద్రాల్లో ఏర్పాట్లపై వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి, బిర్సాయిపేట, శాంతినగర్‌లో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్వింటాల్ 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183తో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం మద్దతు ధర తెలిపే ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జే సుధారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి టీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్య తదితరులున్నారు.

జిల్లాకు ఎన్నికల పరిశీలకుడు



నామినేషన్ ప్రక్రియపై ఆరా తీస్తున్న పాటిల్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడిగా (2008 ఐఏఎస్ అధికారి, మహారాష్ట్ర క్యాడర్)కు చెందిన గణేశ్ బాపురావు పాటిల్ నియామకమయ్యారు. గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయనకు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆదిలాబాద్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ, ఎన్నికల నిర్వహణకు అనుసరిస్తున్న కార్యాచరణ తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా తనను సంప్రదించాలని సూచించారు. ప్రతీరోజు ఉదయం 9నుంచి 10గంటల వరకు స్థానిక పెన్ గంగా విశ్రాంతి భవనంలో తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. 8143876384 నంబర్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

సంబురంగా దండారీ



ఇచ్చోడ: గుస్సాడీలతో కలిసి పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారీ ఉత్సవాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, నార్నూర్, ఇంద్రవెల్లి తదితర మండలాల్లో భోగి పూజలు నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెర్సాపెన్, యేత్మసార్, గ్రామదేవతలకు పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గుస్సాడీలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. – నెట్‌వర్క్



ఇంద్రవెల్లి: పొల్లుగూడలో సంప్రదాయ నృత్యం చేస్తున్న గుస్సాడీలు

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో మెరిసిన క్రీడాకుసుమం


మడావి సోము

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన అథ్లెట్ మడావి సోము 38వ జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటాడు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో లాంగ్‌జంప్ క్రీడల్లో 5.98 మీటర్ల దూరం దూకి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. సోము బజార్‌హత్నూర్ మండలం జాతర ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుకుంటున్నాడు. జాతీయ స్థాయిలో సత్తా చాటడంపై సోము, శిక్షకుడు లక్ష్మీరాంను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేష్, పెటా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి


శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా క్రీడల అధికారి

ఆదిలాబాద్: జిల్లా అర్చర్లు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. మహబూబానగర్‌లో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న ఎస్జీఎఫ్ అండర్ 14 ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన సుధన్ శ్రీజ, మర్సుకోల చందన, పెందూర్ రూప రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా వారికి శిక్షకుడు మారుతి ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి వారికి మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పెటా సెక్రటరీ స్వామి, పిడి రవీందర్, హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులున్నారు.


ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు


క్రీడాకారులతో మాట్లాడుతున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో, జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి బాలుర కబడ్డీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. 14 ఏళ్ల బాలుర విభాగంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 80మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు కన్వీనర్ పాఠశాల ప్రిన్సిపల్ కంటే నర్సయ్య, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా ఎంతో ప్రాచుర్యం పొందిన కబడ్డీలో క్రీడాకారులు రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, పీఈటీల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, పోటీల ఆర్గనైజర్ నాందేవ్ ఉన్నారు.

రోగుల బిల్లులు స్వాహా

- విద్యాశాఖలో ఓ అధికారి ఇష్టానుసారం
- విధులకు రాకుండానే రిజిష్టర్‌లో సంతకాలు
- చర్యకు వెనుకాడుతున్న విద్యాశాఖాధికారులు
- ఇబ్బందులు పడుతున్న టీచర్లు


డీఈవోకు ఫిర్యాదు చేసిన పత్రం


రిజిష్టర్‌లో సంతకాలు చేసిన దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో ఓ ఉద్యోగి అవినీతి, ఆరోపణలు తారస్థాయికి చేరుకున్నాయి. గతంలో కూడా ఆయనపై అనేక ఆరోపణలు రావడం, పలువురు ఉపాధ్యాయులు విద్య శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో ఆయన మరింతగా రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. అతడికి కొంతమంది తోటి ఉద్యోగులు, అధికారుల అండదండలు ఉండడంతో ఆడిందే ఆటా.. పాడిందే పాటగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు గతంలో ఆ ఉద్యోగిపై ఫిర్యాదు చేయడంతో అతడిని ఆ సెక్షన్ నుంచి తొలిగించారు. ఆ ఉద్యోగికి ఎలాంటి సెక్షన్ ఇవ్వకపోగా ప్రస్తుతం ఆయనను ఖాళీగానే ఉంచారు. దీంతో ఆ ఉద్యోగి విధులకు రాకపోవడం, హాజరు పట్టికలో మాత్రం విధులు నిర్వహిస్తున్నట్లు సంతకాలు చేస్తున్నాడు. అయితే అతడి అక్రమాలు తవ్వినకొద్ది బయట పడుతూనే ఉన్నాయి. ఉపాధ్యాయులు గతంలో రోగాల బారిన పడి బిల్లుల కోసం కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం, కొంతమంది ఉపాధ్యాయులకు మరింతగా బిల్లులు పెంచుతామని డబ్బులు అడగడం ఆయనకు పరిపాటిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు త్వరగా చేపిస్తామని సంబంధిత బాధితులకు ఫోన్‌చేసి అడగడం, వారి నుంచి డబ్బులు తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అనేకమంది బాధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు 2022లో మెడికల్ బిల్లుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఏడాది గడిచినా ఆ బిల్లులు చేయకపోవడం, కార్యాలయంలో ఆ ఫైల్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఆ ఉపాధ్యాయులు డీఈఓకు ఫిర్యాదు చేశాడు. సంబంధిత ఫైల్ కూడా కార్యాలయంలో కనిపించకపోవడంతో ఆ ఉద్యోగి ఆందోళన చెందుతున్నాడు. ఇలాంటి తతంగాలు అనేకంగా జరుగుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ ఆ ఉద్యోగిపై చర్యలకు వెనుకాడటం వెనుక మతలబు ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా విద్యశాఖాధికారి ప్రణీతను వివరణ కోరగా, ఆయనకు మెమో జారీ చేయడం జరిగిందని, అతడి వివరణ అనంతరం శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేఖానాయక్ వెంటనే క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

ఉట్నూర్‌రూరల్: ఇటీవల జరిగిన ఓ పార్టీ సభలో బీఆర్‌ఎస్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేఖానాయక్‌కు ఈసారి ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే రేఖానాయక్ సీఎం కేసీఆర్‌కు క్షమాపన చెప్పాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి దండె విఠల్ డిమాండ్ చేశాడు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్‌రావులతో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ భిక్షతో ఎమ్మెల్యే పదవి వచ్చిందని నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆస్తులను పెంచుకోవడంలో పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టలేదని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కార్యకర్తలు ఎవరూ ఊపేక్షించరని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశాడు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన మెనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించాడు. ప్రభుత్వ పథకాలను వివరించి పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, మర్సుకోల తిరుపతి, భరత్‌చౌహాన్, పుర్కబాపురావు, పుష్పరాణి, జగ్జీవన్ ఉన్నారు.

59 ఎక్సైజ్ కేసులు నమోదు

- రూ.69,93,500 విలువ గల మద్యం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నెల రోజుల్లో 59కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం 'సాక్షి'కి తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.69లక్షల 93వేల 500 విలువ గల మద్యం, నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 147 లీటర్ల గుడుంబా, 8 కిలోల గంజాయి, 342 గంజాయి మొక్కలు, 12 లీటర్ల మద్యం, 250 కిలోల బెల్లం, 20 కిలోల పటిక, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించి 17 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 3340 లీటర్ల కల్లు, 206 లీటర్ల కల్తీ కల్లు, 2390 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వివరించారు. తనిఖీలు ఇంకా ముమ్మరంగా చేపడుతున్నామని, ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వ చేసినా, విక్రయాలు జరిపినా టోల్‌ఫ్రీ నం.18004252523కి సమాచారం అందించాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని వివరించారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు


ఇంద్రవెల్లి: పట్టుకున్న మద్యంతో ఎస్సై సునీల్


లోకేశ్వరం: పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఇంద్రవెల్లి: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి రూ.6480 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బెల్ట్‌షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన దన్నూరు ప్రతాప్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. పంచగుడిలోని ప్రతాప్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు సమాచారం మేరకు తనిఖీ చేసి రూ.4900 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించాడు.

హుండీల విరాళం


హుండీలు అందిస్తున్న దృశ్యం

భైంసా: బాసర సరస్వతీ ఆలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బాసర బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండు హుండీలను విరాళంగా ఇచ్చారు. గురువారం ఆర్‌ఎం శంకర్, బ్రాంచ్ మేనేజర్ తీక్షన్‌ల ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువ చేసే రెండు హుండీలను ఆలయానికి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఈ హుండీలను ఉంచనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంజుపుజారి, ఆలయ ఏఈఓ సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సంజీవ్‌రావు ఉన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా సమీపంలో రూ.1,79,500 నగదును సీజ్‌చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రలోని బ లిరాంపూర్ గ్రామం నుంచి నిర్మల్ వైపునకు బులెరో వాహనంలో వెళ్తున్న షేక్ అర్బాజ్ అనే వ్యక్తి వద్ద రూ.1,79,500 నగదు గుర్తించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు కు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించాడు.

పత్తి రైతు ఆత్మహత్య


జక్కుల గోపి (ఫైల్)

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామానికి చెందిన యువ రైతు జక్కుల గోపి(30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపి కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది ఐదెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఆశించిన స్థాయిలో పంట ఎదగకపోవడంతో దిగుబడి రాదని దిగులు చెందాడు. రెండు మూడేళ్లుగా పంట కోసం ప్రైవేటులో చేసిన అప్పులు రూ.5లక్షలకు చేరాయి. అప్పు ఎలా తీర్చాలో తెలియక బుధవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. కాగా, మృతుడి కళ్లను కుటుంబ సభ్యులు దానం చేయగా ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు కార్నియా సేకరించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కుభీర్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పల్సి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ. షరీఫ్ వివరాల ప్రకారం... ముత్తన్న బుధవారం భైంసాలోని బంధువుల శుభకార్యానికి వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం తోట గజ్జన్న చేనులో పురుగుల మందుతాగి మృతిచెంది కనిపించాడు. ఇటీవల కూతురు వివాహానికి అప్పులు చేశాడు. వాటిని తీర్చే దారిలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

కుభీర్: మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎదుర్ల విఠల్(35) ఎండ్రికాయలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందినట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. విఠల్ బుధవారం సాయంత్రం ఎండ్రికాయలు పట్టేందుకు దొడర్నా రోడ్డు పక్కనే గల చెక్‌డ్యాంకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం కుటుంబీకులు చెక్‌డ్యాంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

తలమడుగు: బైక్‌ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తాంసి మండలంలోని లింగుడ గ్రామానికి చెందిన టేకం సోనేరావు(25) దండారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. సోనాపూర్ గ్రామ సమీపంలో వెనుక నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న నాందేడ్ జిల్లాకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోయంపై 55పెండింగ్ క్రిమినల్ కేసులు

- అఫిడవిట్‌లో పేర్కొన్న బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్



బోథ్: బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ గురువారం నామినేషన్ దాఖలు చేశాడు. ఆయన అందించిన అఫిడవిట్‌లో పలు విషయాలు వెల్లడించారు.

సోయం బాపూరావ్‌పై పెండింగ్‌లో ఉన్న కేసులు : 55
ఆదాయం: 2022–23 ఆర్థిక సంవత్సరానికి
సోయం బాపూరావ్: రూ.15,70,000
భారతి(భార్య) : రూ. 4,21,850
సోయం వెంకటేష్(కుమారుడు): రూ. 4,37,350
సోయం శిల్ప (కోడలు): రూ. 4,58,710
సోయం మహేష్ (కుమారుడు): రూ. 4,56,140
సోయం క్రిష్ణవేణి(కుమార్తె): రూ. 4,52,140

చరాస్తుల విలువ:
సోయం బాపూరావ్ : రూ. 28,02,054
భారతి(భార్య): రూ.14,11,184
సోయం వెంకటేష్(కుమారుడు): రూ. 2,95,386
సోయం శిల్ప (కోడలు): రూ. 3,03,110
సోయం మహేష్ (కుమారుడు): రూ. 1,39,140
సోయం క్రిష్ణవేణి(కుమార్తె): రూ. 6,14,540

స్థిరాస్తుల విలువ:
సోయం బాపూరావ్: రూ. 1,13,00,000
భారతి(భార్య): రూ. 28,00,000
సోయం వెంకటేష్(కుమారుడు): రూ. 22,75,000

రుణాలు:
సోయం బాపూరావ్: రూ.21,37,356

సిరిసిల్లలో ఖానాపూర్ వాసి నామినేషన్


సిరిసిల్లలో నామినేషన్ వేస్తున్న దొనికెని కృష్ణ

ఖానాపూర్: గల్ఫ్ కార్మికుల సమస్యలపై బీఆర్‌ఎస్ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహించే సిరిసిల్లలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కార్మికుల పక్షాన నామినేషన్ వేశానని ఖానాపూర్ మండలం మస్కాపూర్ నివాసి, ఎన్‌ఆర్‌ఐ, గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపకుడు దొనికెని కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఎన్‌ఆర్‌ఐ పాలసీతో కూడిన బోర్డును ఏర్పాటుచేసి వారి సంక్షేమానికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, తమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఆయన వెంట గల్ఫ్ కార్మిక అవగాహన వేదిక నాయకులు ఉన్నారు.

బాపూరావుకు బాపూరావ్ తోడు

- గత ఎన్నికల్లో ప్రత్యర్థిగా.. నేడు మద్దతుదారుడిగా


నామినేషన్ వేయడానికి సోయంతో వస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

బోథ్: 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఉన్న వారు ఇప్పుడు మిత్రులయ్యారు. గత ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్ నుంచి రాథోడ్ బాపూరావ్, కాంగ్రెస్ నుంచి సోయం బాపూరావ్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయగా రాథోడ్ బాపూరావ్ గెలుపొందారు. కాగా 2023లో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా సోయం బాపూరావ్ ఉండగా, బీఆర్‌ఎస్ టికెట్ దక్కకపోవడంతో బోథ్ ఎమ్మెల్యే బాపూరావ్ బీజేపీలో చేరాడు. గురువారం నామినేషన్ సందర్భంగా ఇద్దరు కలిసి వచ్చి నామినేషన్ వేశారు. సోయం బాపూరావ్‌కు మద్దతుగా రాథోడ్ బాపూరావ్ రావడంతో ప్రత్యర్థులు, మిత్రులుగా మారిపోయారు.

నిన్న బీజేపీ -నేడు కాంగ్రెస్




లక్ష్మణచాంద: మండలంలోని ప్రజాప్రతినిధుల వ్యవహారం రోజురోజుకు మారుతోంది. బుధవారం మండలంలోని న్యూ కంజర్ గ్రామానికి చెందిన సర్పంచ్ శోభారాణి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో చేరింది. పార్టీలో చేరి ఒక్క రోజు కూడా గడువకముందే గురువారం మళ్లీ కాంగ్రెస్ పార్టీలో శ్రీహరిరావు సమక్షంలో చేరారు. దీంతో ప్రజాప్రతినిధులు ఏ రోజు ఏ పార్టీలో చేరుతారో అనే సందేహం మొదలైంది.

ప్రలోభాలను పట్టేసుకుంటారు..


ఫ్లయింగ్ వాహనంపై సీసీ కెమెరా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగదు, కానుకలు ఓటర్లకు చేరవేయకుండా ఉండేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం పెద్ద ఎత్తున వాహనాల్లో గస్తీ చేపడుతుంది. అయితే ఇటీవల వీరి వాహనాలకు 360 డిగ్రీలు తిరుగుతూ రికార్డింగ్ చేసేలా ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ వాహనానికి జీపీఎస్ కూడా ఉండటం, సీసీ కెమెరా పనితీరు మొత్తం ఎన్నికల కమిషన్‌కు అనుసంధానంగా ఉండటంతో వీరి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఓటర్లకు పంచే నగదు, నగలు, కానుకలను గుర్తించడంతో పాటు వాటిని పట్టుకుంటుంది. పోలింగ్ జరిగేంత వరకు ఈ వాహనాలు నిరంతరం చక్కర్లు కొడుతూ నిఘా ఉంచుతాయి. మంచిర్యాల నియోజకవర్గంలో మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలు 24 గంటల పాటు నిఘాలో ఉంటున్నాయి.

డ్రైంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

నిర్మల్ రూరల్: మద్యం తాగి పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పు చెప్పినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మండలంలోని లంగ్డాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వేంగాపేట్ గ్రామానికి చెందిన తలారి శంకర్ మద్యం తాగి పట్టుబడ్డాడు. గురువారం కోర్టులో హాజరుపరచగా అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి అజీజ్ రెహమాన్ తీర్పు చెప్పాడు.

వైద్యురాలిని వేధించిన ముగ్గురికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: వైద్యురాలిని వేధించిన కేసులో ముగ్గురు యువకులకు ఏడాది జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి కే.ప్రభాకరరావ్ గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ రాజు తెలిపారు. కాలేజ్‌రోడ్ గర్మిళ్లకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యురాలిని అదే ప్రాంతానికి చెందిన అట్లా సంతోష్, మాటేటి శ్రావణ్, అందే అశోక్ కొంతకాలంగా వెంబడించేవారు. 2018 మే 27న నైట్ డ్యూటీకి వెళ్తుండగా ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెంబడించి వేధింపులకు గురిచేయడంతో 2018 మే 30న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గుర్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో రెండో అదనపు కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీంతో నిందితులు జిల్లా కోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావ్ కేసును విచారించిన అనంతరం నిందితుల అప్పీల్‌ను కొట్టివేస్తూ అదే తీర్పును ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

రైలు కిందపడి ఒకరు మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని–మంచిర్యాల రైల్వేస్టేషన్ల మధ్య క్యాతనపల్లి రైల్వేగేటు సమీపంలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మృతుని వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు మృతి చెందాడా? తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్యాషన్





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు

నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి,



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ- ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి: మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పీరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.